
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 86 | శుక్రవారం 26 జూన్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-



### తిరుమల వెంకన్నను దర్శించుకున్న

VicenteFerrer
Rural Development Trust

# ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్



## ఫెర్రర్ కుటుంబాన్ని ఆశీర్వదించిన వేద పండితులు

## మడకశిర ఎమ్మెల్యే రాజు, కలెక్టర్ శ్యాంప్రసాద్,

**(అంకుశం ప్రతినిధి, తిరుపతి, జూన్ 26):**

అనంతపురం జిల్లాలో గత 55 సంవత్సరాలుగా పైగాబడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా విద్యా వైద్య క్రీడారంగంలో విశేష సేవలు అందిస్తున్నరూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, భార్య విశాలా ఫెర్రర్ కుమార్తెలు కుటుంబం సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకుంది ఫెర్రర్ కుటుంబంతోపాటు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు కుటుంబం సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ ఫెర్రర్ మాట్లాడుతూ రాష్ట్రము జిల్లా సుభిక్షంగా ఉండాలని రైతులు అన్ని వర్గాల ప్రజలు క్షేమంగా వర్షాలు పడి అందరికీ మంచి జరగాలని ప్రార్థించడం జరిగిందని అన్నారు - మిగతా 2లో





# రెండు రోజులు వర్షాలు

### ఈదురు గాలులు ఎక్కువగా వీచే అవకాశం

**(అంకుశం, అమరావతి, జూన్ 26):**



ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత నుండి మధ్య మహారాష్ట్ర వరకు తెలంగాణ దాని పరిసర ప్రాంతాలపైనున్న ఉపరితల ఆవర్తనం మీదుగా ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో శనివారం చెదురుమదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ,మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఆకాశం మేఘావతమై ఉరుములు వినిపించిన వెంటనే పొలాల్లో పనిచేసే రైతులు,శ్రామికులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

### సీఎం చంద్రబాబు..

# రేపు వెలిగొండ ప్రాజెక్టు పరిశీలన

### లబ్ధిదారులతో సమావేశం

### అనంతరం గిద్దలూరులో పర్యటన



**(అంకుశం, అమరావతి, జూన్ 26):**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజున యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. జూలై నెలకు మొదటి ఫేజ్ పూర్తి చేయాలనే లక్ష్యంతో శరవేగంగా సాగుతోన్న వెలిగొండ ప్రాజెక్టు పనుల పరిశీలనతో పాటు గిద్దలూరు నియోజకవర్గంలో సంజీవని కార్యక్రమంలో పాల్గొంటారు. మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు వెలిగొండ ప్రాజెక్టు ఎంతో కీలకం. ఇది పూర్తైతే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరతాయి. అంతేకాదు దశాబ్దాలుగా నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యకూ ముగింపు పలుకుతుంది. రెండు దశలుగా సాగుతోన్న ఈ ప్రాజెక్టులో.... స్టేజ్--ఐలో 1,19,000 ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు, స్టేజ్--ఐఐలో 3,28,300 ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. స్టేజ్--ఐ కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.5,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది. దాదాపు 19 కి.మీ. మేర టన్నెల్--ఐ తవ్వకం, ఎగ్జిట్ ఛానల్ -- లింక్ ఛానల్ పనులు పూర్తయ్యాయి. ఫీడర్ కాలువ, తీగలేరు, గొట్టిపడియ ప్రధాన కాలువ సిద్ధమయ్యాయి. రెండు హెడ్ రెగ్యులేటర్లు, టన్నెల్ లైనింగ్, అప్రోచ్ ఛానల్, తూర్పు ప్రధాన కాలువ పనులు చివరి దశకు వచ్చాయి. ఆర్ అండ్ ఆర్ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.190 కోట్లను ఖర్చు - మిగతా 2లో

# లక్ష్యం.. డ్రగ్స్ రహిత ఏపీ

### హోం మంత్రి వంగలపూడి అనిత




**(అంకుశం, అమరావతి, జూన్ 26):**

దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డిపారటట్మంట్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫెరెంట్లీ ఏబుల్డ్, ట్రానట?స్జెండర్ అండ్ సీనియర్ సిటిజన్స్ శాఖ, ఈగల్ సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్య - మిగతా 2లో

### ముగ్గురు సీఎంలు..

## జలాల వినియోగంలో ఐక్యత చూపాలి

### సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ



**(అంకుశం, అమరావతి, జూన్ 26):**

తుంగభద్ర డ్యాంలో కొత్త గేట్ల ప్రారంభోత్సవానికి హాజరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ప్రదర్శించిన ఐక్యతను కృష్ణా, గోదావరి జలాల సద్వినియోగంలోనూ కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ కోరారు. ప్రతి సంవత్సరం కృష్ణా, గోదావరి నదుల నుంచి వేల టీఎంసీల నీరు సముద్రంలో వథాగా కలుస్తోందని, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే - మిగతా 2లో

# దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తా

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా, దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని, వారి గళాన్ని అధికార కేంద్రాలకు వినిపిస్తానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. చీజుజు సహా రాజ్యాంగ పరిరక్షణ వంటి కీలక అంశాలపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేశారు. వీధుల స్థాయి నుంచి పార్లమెంటు వరకు ప్రజల నమ్మకమే తన అతిపెద్ద బలమన్నారు. లోక్?సభ ప్రతిపక్ష నేతగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ మేరకు ఎక్స్?లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. "నేను లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టి నేటికి రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ రెండేళ్లలో రోజూ ఒకే ఒక్క లక్ష్యానికి అంకితమయ్యాను. అదే ప్రతి భారతీయుడి గళాన్ని అధికార కేంద్రాలకు చేరవేయడం. నీట్ (చీజుజు) అభ్యర్థుల కోసం పోరాటం కావచ్చు, ఎన్నికల అక్రమాలను బయటపెట్టడం కావచ్చు లేదా రాజ్యాంగాన్ని కాపాడటం కావచ్చు. ప్రతి విషయంలోనూ నేను మీకు అండగా నిలిచాను. ఈ రోజు కూడా మీకు అండగా ఉన్నాను, ఎప్పటికీ ఉంటాను. వీధుల నుంచి పార్లమెంటు వరకు మీ నమ్మకమే నా అతిపెద్ద బలం. ఈ ప్రయాణం సుదీర్ఘమైనది. కానీ నా సంకల్పం మాత్రం మారలేదు. మీ కోసం ప్రతి పోరాటాన్ని కొనసాగిస్తాను. జై హింద్. జై రాజ్యాంగం."

2024 జూన్?లో ప్రతిపక్ష నాయకుడిగా నియమితులైన రాహుల్ గాంధీ భారత పార్లమెంటరీ రాజకీయాల్లో ఒక చారిత్రక మార్పుకు నాంది పలికారు. ఎందుకంటే 16, 17వ లోక్‌సభల కాలంలో ఈ పదవి దశాబ్దం పాటు ఖాళీగా ఉండిపోయింది. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం, ప్రతిపక్ష నాయకుడి (రాశీ) పదవిని దక్కించుకోవాలంటే ఒక పార్టీ సభ మొత్తం బలం (543 స్థానాలకు గాను 55)లో కనీసం పదో వంతు స్థానాలను గెలుచుకోవాలి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 99 స్థానాలను గెలుచుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఈ అర్హతను సాధించింది.

2004లో రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి రాహుల్? గాంధీ చేపట్టిన మొట్టమొదటి అధికారిక రాజ్యాంగబద్ధమైన



పదవి ఇదే. అలాగే లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా గాంధీ కుటుంబ సభ్యుడు వ్యవహరించడం ఇది మూడోసారి. అంతకుముందు సోనియా గాంధీ, రాజీవ్ గాంధీ కూడా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించారు. రాహుల్? గాంధీ ఐదుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఉత్తర్?ప్రదేశ్?లోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గానికి గతంలో ఆయన తల్లి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించారు.

**ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ఫైర్**

ఇదిలా ఉండగా, మరో పోస్ట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పుట్టినరోజున ఆయనను ప్రశంసించడాన్ని ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ ఆరోపణల తర్వాత తన కేబినెట్ సహచరుడికి శుభాకాంక్షలు తెలిపినా ఆయన, ప్రాణాలు కోల్పోయిన పిల్లల గురించి ఒక్కసారైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. విచ్ఛిన్నమైన వ్యవస్థ, జవాబుదారీతనం వహించడానికి నిరాకరించే ప్రభుత్వం వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలు, భవిష్యత్తు నాశనమయ్యాయని అన్నారు. ఈ జాబితాలోని ప్రతి పేరు ఒక కల, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ఉన్న బిడ్డది. ఇవన్నీ ఒక విచ్ఛిన్నమైన వ్యవస్థ, పాఠాలు నేర్చుకోవడానికి లేదా జవాబుదారీతనం వహించడానికి నిరాకరించే ప్రభుత్వం వల్ల నాశనమయ్యాయి. ప్రతి ఒక్క విద్యార్థిని గుర్తుంచుకోండి. ప్రధాని మోదీ ధర్మేంద్ర ప్రధాన్ పుట్టినరోజున ఆయనను ప్రశంసించినప్పుడు, ఈ పిల్లల గురించి ఒక్కసారైనా ఆలోచించారా?" అంటూ పార్టీ నేత పవన్? ఖేడా పోస్ట్?ను రాహుల్ గాంధీ ట్యాగ్? చేశారు. ఇందులో నీట్? పేపర్? లీక్? ఆరోపణల తర్వాత మరణించిన 14 మంది విద్యార్థుల పేర్లు ఉన్నాయి.

# ఎవరు ఎక్కువ క్షమాపణలు చెప్పారు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు. ఆయన వ్యాఖ్యలపై చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ ప్రతిపక్ష నేత రాహుల్ తరచుగా క్షమాపణలు చెబుతున్నారని విమర్శించారు. "తప్పుడు ఆరోపణలు చేసిన తర్వాత ఎవరు ఎక్కువ క్షమాపణలు చెప్పారు రాహుల్ గాంధీ లేదా అరవింద్ కేజ్రీవాల్" అని రిజిజు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ చౌహాన్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టులో విచారం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. అంతకుముందు కార్తికేయ చౌహాన్‌పై తాను చేసిన పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టు ముందు విచారం వ్యక్తం చేశారు. 2018లో ఝుబువాలో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో పనామా పేపర్స్ లీక్ కుంభకోణానికి సంబంధించి తన పేరును ప్రస్తావించి, తన ప్రతిష్టను దెబ్బతీశారని కార్తికేయ చౌహాన్ ఆరోపించారు. ఈ మేరకు భోపాల్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో రాహుల్ గాంధీపై పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు.

**రాహుల్ విదేశీ పర్యటనలపైనా బీజేపీ ఫైర్**

మరోవైపు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపైనా బీజేపీ తీవ్రంగా విమర్శించింది. రాహుల్ గాంధీ ఎప్పుడూ సెలవుల మూడ్‌లోనే ఉంటారని ఎద్దేవా చేసింది. పార్లమెంట్, ఎన్నికలు లేదా తన పార్టీకి




అవసరమైనప్పుడల్లా తరచుగా గైర్హాజరవుతారని బీజేపీ శుక్రవారం ఆరోపించింది. తాజాగా రాహుల్ గాంధీ "మరో విదేశీ పర్యటన"లో ఉన్నారని పేర్కొంది. ఆరా అంటే 'లీడర్ ఆఫ్ అపోజిషన్' కాదని, 'లీడర్ ఆఫ్ పర్యటన్, పార్టీంగ్' అంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా వీడియో ప్రకటనలో వ్యాఖ్యానించారు.

"రాహుల్ గాంధీ లీడర్ ఆఫ్ అపోజిషన్ పేరును 'లీడర్ ఆఫ్ పర్యటన్, పార్టీంగ్'గా మార్చుకోవాలి. ఎందుకంటే ఆయన ఎప్పుడూ చేసేది అదే. పార్టీలు, పర్యాటకం, ప్రయాణాలు. ప్రజలు, పార్లమెంట్‌కు లేదా దేశానికి కూడా ప్రాధాన్యం ఇవ్వరు. ఆయన పర్యాటకానికే మొదటి ప్రాధాన్యం ఇస్తారు. పార్టీకి సంస్థాగత మద్దతు అవసరమైన కీలక సమయాల్లో పారిపోతారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో అందుబాటులో ఉండరు. రాహుల్ గాంధీ నిరంతరం సెలవుల మూడ్‌లో ఉంటారు. ఒకవైపు, ప్రధానమంత్రి మోదీ దేశంలో అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రిగా నిలిచారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా, ప్రభుత్వ అధినేతగా 9,000 రోజులకు పైగా ఆయన ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. దీనినే పని విధానం, సేవా విధానం అంటారు. మరోవైపు రాహుల్ గాంధీ కేవలం సెలవులో ఉన్నందున, ఆయన అత్యధిక కాలం పనిచేసిన ప్రతిపక్ష నాయకుడిగా నిలిచే అవకాశం ఉంది." రాహుల్ గాంధీ వందలాది విదేశీ పర్యటనలు, యాత్రలు చేపట్టారని, ఈ పర్యటనలకు నిధుల కేటాయింపును పూనావాలా ప్రశ్నించారు. "సాధారణంగా ప్రజలు రెండు ప్రాజెక్టుల మధ్య సెలవు తీసుకుంటారు. రాహుల్ గాంధీ మాత్రం రెండు సెలవు కాలాల మధ్య కొద్దిపాటి సమయం పని కోసం భారతదేశానికి వస్తారు. ఆయన తన విహారయాత్రల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. కానీ విదేశీ పర్యటనలు, ప్రయాణాల కోసం ఈ డబ్బును ఎలా ఖర్చు చేస్తున్నారో లెక్క చెప్పలేకపోతున్నారు. స్పష్టంగా, కొన్ని అనుమానాస్పద సంస్థలే వీటికి నిధులు సమకూరుస్తున్నాయి. అవే అజెండాను నిర్దేశిస్తాయి. అది సాధారణంగా భారత్‌కు వ్యతిరేకమైనదిగా ఉంటుంది. దీనిపై కూడా కాంగ్రెస్, రాహుల్ గాంధీ ఎలాంటి వివరణ ఇవ్వడం లేదు. రాహుల్ గాంధీ మరోసారి విదేశాలకు వెళ్లారు. పార్లమెంటుకు, పార్టీకి, ప్రజలకు ఆయన అవసరం ఉన్నప్పుడు ఆయన కనిపించకుండా పోయి, భారత్‌కు వ్యతిరేకంగా విషం చిమ్ముతారు." అని పూనావాలా అన్నారు.

# ఎస్ఐఆర్‌కు ఏడాది పూర్తి

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు ఏడాది పూర్తయింది. ఈ ప్రక్షాళనలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 6 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఎన్నికల సంఘం తొలగించింది. ఈ భారీ తొలగింపులపై ప్రతిపక్షాలు, ఎన్నికల సంఘం మధ్య తీవ్ర మాటల యుద్ధం నడుస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో మూడో దశ ప్రక్షాళన కొనసాగుతోంది. గత ఏడాది జూన్ 24న బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది. బిహార్‌లో ఈ ప్రక్రియ ద్వారా ఏకంగా 65 లక్షల ఓట్లను తొలగించారు. అయితే, పత్రాలు లేవన్న నెపంతో, అధికార బీజేపీకి మేలు చేసేందుకే ఎన్నికల సంఘం ఈ చర్యలకు పాల్పడుతోందని ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. కానీ, ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు ఏకగ్రీవ తీర్పుతో ఎన్నికల సంఘం చేపట్టిన ఈ రివిజన్ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదేనని స్పష్టం చేసింది. అయితే, ఈ ఓట్ల తొలగింపు ప్రభావం సంక్షేమ పథకాలపై కూడా పడుతోంది. బంగాల్, బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలు ఓటర్ల డేటాను సామాజిక భద్రతతో అనుసంధానం చేయడంతో, ఓటు హక్కు కోల్పోయిన వారు ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా దూరమవుతున్నారు. ఈ భారీ ప్రక్షాళన కార్యక్రమం ప్రాముఖ్యతను గుర్తిస్తూ, దీనిని ఎన్?సీఈఆర్?టీ సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాల్లో కూడా చేర్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులను తొలగించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని అందులో వివరించారు. ఇక గత ఏడాది అక్టోబరు 27న ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్, తమిళనాడు సహా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రెండో దశ ప్రారంభమైంది. దీని ద్వారా ఈ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను



ఏకంగా 10.2 శాతం మేర కుదించారు. ప్రక్షాళనకు ముందు 50.99 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య 45.81 కోట్లకు పడిపోయింది. అంటే 5.18 కోట్లకు పైగా పేర్లను తొలగించారు. ఇందులో మరణించిన 66,88,000 మంది పేర్లను జాబితా నుంచి తీసేశారు. అత్యధికంగా యూపీలో 25.47 లక్షలు, బంగాల్‌లో 24.16 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను తొలగించారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత మరో 63.16 లక్షల పేర్లను డిలీట్ చేశారు. ప్రస్తుతం (ఎస్ఐఆర్) ప్రక్రియ మూడో దశకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 14న మూడో దశ సవరణ ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏకంగా 36.73 కోట్ల మంది ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం నిశితంగా పరిశీలిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి ఈ మూడో దశ సవరణ ప్రక్రియ పూర్తిగా ముగియనుంది.

యావత్ దేశాన్ని కుదిపేసిన వివాదం

బంగాల్‌లోని మాల్దాలో ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొన్న ఏడుగురు న్యాయాధికారులను నిర్బంధించిన ఘటన అప్పట్లో యావత్ దేశాన్ని కుదిపేసింది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడాన్ని నిరసిస్తూ ఆందోళనకారులు ఈ చర్యకు దిగారు. మొదట న్యాయాధికారులతో సమావేశం కావాలని నిరసనకారులు కోరగా, అందుకు అనుమతి నిరాకరించడంతో అధికారులను నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని జ్యుడీషియల్ అధికారులను నిర్బంధం నుంచి విడిపించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం మండిపడింది. ఇది దురదృష్టకర పరిణామమని ఆవేదన వ్యక్తం చేసింది. దీన్ని ఉద్దేశపూర్వకంగా చేసిన దాడిగా పేర్కొంది. బంగాల్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని వ్యాఖ్యానించింది. ముగ్గురు మహిళలు సహా ఏడుగురు న్యాయాధికారులను కొన్ని అసాంఘిక శక్తులు నిర్బంధించాయని, ఆ రోజు అర్ధరాత్రి వరకు తాను స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించాల్సి వచ్చిందని స్వయంగా సీజేఐ వెల్లడించారు.

## తిరుమల వెంకన్నను దర్శించుకున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్

-మొదటిపేజీ తరువాయి

సందర్భంగా వారు భక్తి శ్రద్ధలతో స్వామి వారి దర్శనం చేసుకుని, ప్రార్థనలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. గత రెండు సంవత్సరాలుగా ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఏ సమస్యతో ఇబ్బంది పడిన విషయం తెలిసిందే ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఎ ను రెన్యువల్ చేయడంతో కుటుంబ సమేతంగా తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రార్థించారు మరల అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆర్డిటి సేవలు మరింతగా కొనసాగుతాయి మంచోఫెర్రర్ కుటుంబంతోపాటు ఆర్డిటి డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి నాగప్ప శ్రీనివాసులు విశ్వనాథ్ పెద్ద ఎత్తున ఆర్డిటి డైరెక్టర్లు కుటుంబ సభ్యులు బంధువులుసభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు

## సీఎం చంద్రబాబు.. రేపు వెలిగొండ ప్రాజెక్టు పరిశీలన

-మొదటిపేజీ తరువాయి

చేసింది. మొత్తం 11 గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ఈ మేరకు రేపు ప్రాజెక్టును సందర్శించిన అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రభుత్వం సంజీవని ప్రాజెక్ట్ తీసుకొచ్చింది. అందరికీ ఆరోగ్య సేవలు, ఆరోగ్య భద్రత చేకూర్చాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యం. నాణ్యమైన, అందుబాటు ధరల్లో, సకాలంలో వైద్య సేవలు అందించే సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక ఈ సంజీవని. పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రి వరకు, ఆరోగ్య ఉప కేంద్రం నుంచి సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం చేయనున్నారు.

సీఎం పర్యటన వివరాలు ఇలా..

శనివారం ఉదయం 10:45 గంటలకు దోర్నాల మండలం, గంటవానిపల్లెకు చేరుకుంటారు. 11 నుంచి మధ్యాహ్నం 12:20 గంటల వరకూ వెలిగొండ ప్రాజెక్టు సందర్శనతో పాటు, అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. వెలిగొండ ప్రాజెక్టు పర్యటన ముగించుకుని 12:35 గిద్దలూరు నియోజకవర్గం కష్ణంసెట్టిపల్లికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 01.10 నుంచి 01.40 వరకు కష్ణంసెట్టిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని పథకం లబ్ధిదారులు, వైద్య సిబ్బందితో సమావేశం అవుతారు. 01:45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 03.35 గంటలకు టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 06.15 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## లక్ష్యం.. డ్రగ్స్ రహిత ఏపీ

-మొదటిపేజీ తరువాయి

దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు. నేటి తరం పిల్లలు ఎంతో ఫాస్ట్ గా, క్లారిటీగా ఉంటున్నప్పటికీ, చిన్న అవగాహన లోపం వల్ల డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' (నివారణే మేలు) అన్నట్లుగా, యువత వీటి జోలికి వెళ్లకుండా ముందే కాపాడుకోవడం ముఖ్యం అని చెప్పారు. గంజాయి రవాణా, సాగును అరికట్టడానికి 450 మంది సిబ్బందితో పనిచేస్తున్న 'ఈగిల్' టాస్క్ ఫోర్స్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని కొనియాడారు. గత గత ప్రభుత్వ కాలంలో ఏజెన్సీ పరిధిలో దాదాపు 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని దానిని ధ్వంసం చేశామని, ప్రస్తుతం అక్కడ గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించి 'జీరో కల్టివేషన్' సాధించామని స్పష్టం చేశారు. లిక్విడ్ గంజాయి (హాష్ ఆయిల్) తయారీ కేంద్రాలపై కూడా కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి మాట్లాడుతూ.. ధూమపానం, మద్యపానం కంటే డ్రగ్స్ అత్యంత ప్రమాదకరమైనదన్నారు. ప్రస్తుతం దక్షిణాదిలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ దుర్వినియోగం పెరగడం ఆందోళనకకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా,ఈగిల్ వింగ్ ఎస్పీ జి. స్వరూపారాణి, రాష్ట్ర స్థాయి దేవి ఇని?స్టిట్యూషనల్ సొసైటీస్ చైర్ పర్సన్ దేవి, స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరంతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## ముగ్గురు సీఎంలు.. జలాల వినియోగంలో ఐక్యత చూపాలి

-మొదటిపేజీ తరువాయి

సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి జలాల సద్వినియోగానికి సంయుక్త కార్యాచరణ చేపట్టాలని, ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

**ఆ ఘటన దురదృష్టకరం..**

విజయవాడలోని కృష్ణలంక స్టేషనల్ జరిగిన లాకప్‌డెత్ ఘటన, శవం మాయం చేసిన ఘటనపై రామకృష్ణ స్పందిస్తూ.. ఒక వ్యక్తి పోలీస్ కస్టడీలో మృతి చెందడం, అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించకుండా వ్యవహరించడం అత్యంత ఆందోళనకరమని విమర్శించారు. మృతుడి తల్లి పదేపదే కనీసం తన కుమారుడి అస్థికలైనా ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మొత్తం వ్యవహారంపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## నిజమైన రైతులకే సబ్సిడీ ఎరువులు

**-- పంపిణీలో సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 155251కు ఫిర్యాదు చేయొచ్చు**

**-- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**(అంకుశం, అమరావతి, జూన్ 26):** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా, సకాలంలో సబ్సిడీ ఎరువులు అందించేందుకు ప్రవేశపెట్టిన ఏపీఏఐఎంఎస్ 2.0 వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీ నుంచి కృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డీఏపీ పంపిణీ చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2,97,733 మంది రైతులకు 48,588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874 మెట్రిక్ టన్నుల డీఏపీ విజయవంతంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. దీనివల్ల అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందేలా పూర్తి భరోసా కల్పించామని మంత్రి పేర్కొన్నారు. రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అవసరమైన పరిమాణంలోనే ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. దీంతో సమతుల్య ఎరువుల వినియోగం పెరిగి, రైతులకు దిగుబడులు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా సక్రమంగా వినియోగమవుతుందని చెప్పారు. ఏపీఏఐఎంఎస్ 2.0 ద్వారా ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, మళ్లింపులు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాలు పూర్తిగా అరికట్టే అవకాశం లభించిందన్నారు. ఎరువుల కొరత, నాణ్యత, అధిక ధరలు లేదా పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 155251 కు కాల్ చేయవచ్చని మంత్రి తెలిపారు. రైతులు తమ ఎరువుల కొనుగోలు చరిత్ర, అర్హత వివరాలను కూడా సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని, రైతు--కేంద్రీకత, పారదర్శక, సాంకేతికత ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థగా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఏ నిజమైన రైతుకూ ఎరువు నిరాకరించబడకూడదు... ఏ అనధికార వ్యక్తి లేదా రైతు కాని వ్యక్తికి సబ్సిడీ ఎరువు అందకూడదు అన్నదే మార్గదర్శక సూత్రమని మంత్రి స్పష్టం చేశారు

# సీఎం రిలీఫ్ ఫండ్ పేద కుటుంబాలకు వరం

**– పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి**

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, జూన్ :26:** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటోందని పుట్టపర్తి నియోజవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు. శుక్రవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి నియోజకవర్గానికి చెందిన 33 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 20,86,536 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు అండగా నిలుస్తూ కష్టకాలంలో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఆపద్బాంధవుడని కొనియాడారు. కష్టాల్లో ఉన్నప్పుడు సాయం చేసిన వ్యక్తిని, ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో పుట్టపర్తి నియోజకవర్గంలో మొత్తం 431 మంది లబ్ధిదారులకు





రూ. 4.12 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందజేసి పేద కుటుంబాలను ఆదుకున్నామని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. పలు రకాల జబ్బులతో ఇబ్బంది పడి ఆసుపత్రిలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకుని ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 3 మాసాల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సహకార సొసైటీ అధ్యక్షులు విజయకుమార్ , సామకోటి ఆదినారాయణ, శ్రీరామ్ నాయక్, శ్రీరాములు ,రాజా కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జులై 19 న నంద్యాలలో బహుజన ఉద్యోగుల న్యాయభేరి

**– పోస్టర్ విడుదల, చేసిన డాక్టర్ పోతుల నాగరాజు**

**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 26:** అనంతపురం నగరంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ దీ= అంబేద్కర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులు అర్పించి వారి ఆశయ సాధన లో భాగంగా జులై 19 న జరిగే బహుజన ఉద్యోగుల న్యాయభేరి పోస్టర్ ను రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (REF) మరియు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (RPS )నేతల ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు మాట్లాడుతూ దేశం లో రెండు వర్గాలుగా సమాజాన్ని విడగొట్టి కేవలం కార్పొరేట్ ప్రయోజనాల కోసం పాలనా చేస్తూ సామాన్య ప్రజల జీవితాలను విక్షిన్నం చేస్తున్నారు, సామాన్య ప్రజలకు న్యాయం జరగాలి అంటే రాజ్యాంగ బద్ధమైన పాలన జరగాలి ఇప్పుడు అలాంటి పాలన రాష్ట్రము లో లేదు దేశంలోను లేదు. అందుకే బహుజన సమాజంలోని విద్యావంతులు, ఉద్యోగ,ఉపాధ్యాయ వర్గం, న్యాయవాదులు,డాక్టర్ లు, ఇతర వృత్తి నిపుణులను ఒక వేదిక మీదకు తీసుకొని రావాలనే ప్రయత్నంలో భాగంగా జులై 19 న బహుజన ఉద్యోగుల న్యాయభేరి ని నంద్యాల పట్టణం లో గ్రేటర్ రాయలసీమ ఉమ్మడి జిల్లా సభ ను ఏర్పాటు చేయడం జరిగింది, ఈ సభ విజయవంతం చేయాలని నాగరాజు కోరారు. ఉద్యోగుల కు ౣ=జ వెంటనే ప్రకటించి, ణూ బకాయిలు విడుదల, పదవీ విరమణ చేసిన



ఉద్యోగుల బకాయిలు వెంటనే ఇవ్వాలని రాష్ట్రము లోను దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖ లలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రకృతి సంపద లో అన్ని వర్గాల ప్రజల వాటా ఇవ్వాలని ఈ భేరి ద్వారా రాజకీయ పార్టీ ల ద్రుష్టికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం ద్రుష్టికి తీసుకొని వెళదాం అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ౚూ ఢ=జుఖీ నాయకులు జి.నాగభూషణ,=. నారాయణ నాయక్ రమేష్, శ్రీరాములు చింతన్న, నారాయణప్ప చెరుకూరి హరి, మహేష్, దండు కేశవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ, హేమంత్, సురేష్ మేవా, తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి


**– ఈఆర్వోలు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**– జిల్లా అధికారులు వారి సంబంధిత కార్యాలయాల్లో సర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి**

**– : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అంకుశం న్యూస్అనంతపురము, జూన్ 26:**

**– ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈఆర్వోలు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలనీ జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులకు స్పష్టం చేశారు.**



– శుక్రవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, వివిధ శాఖల హెచ్వోడీలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో 2002 ఓటరు జాబితా అందుబాటులో ఉండేలా సంబంధిత ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్యూమరేషన్లో పూర్తి పారదర్శకత పాటించాలనీ సూచించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ మరియు వార్డు సచివాలయాల్లో 2002 ఓటరు జాబితా తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, ప్రజలు తమ వివరాల ధృవీకరణ కోసం ఇబ్బందులు పడకుండా ప్రతి సచివాలయంలో ఒకటి లేదా రెండు ఓటరు జాబితాలను ప్రింట్ చేసి హెల్ప్డెస్క్ల ద్వారా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు వారి సంబంధిత కార్యాలయాల్లో సర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలనీ పేర్కొన్నారు. బీఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టేలా ఈఆర్వోలు నిరంతరం పర్యవేక్షించాలని, ఆన్లైన్ వెరిఫికేషన్ విధానంపై బీఎల్వోలకు పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎలక్టోరల్ రోల్లో ఉన్న అన్మ్యాప్డ్, అనామలీస్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత ఈఎఫ్ ఫారాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. బీఎల్వోల వద్ద అందుబాటులో ఉండే అన్మ్యాప్డ్, అనామలీస్, ఆన్లైన్ మ్యాపింగ్ వివరాలను క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా సరిచూసుకోవాలని, బిఎల్ఎతో కలిసి ప్రతి రోజు సాయంత్రం కనీసం గంట సేపు రచ్చబండ లాంటి కామన్ ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో క్రమం తప్పకుండా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో పలువురు ఉదయం పనులకు వెళ్ళే వారు ఉంటారని కావున ఉదయంపూట తొందరగా, అలాగే సాయంత్రం కూడా ఎన్యూమరేషన్ సిబ్బంది ఇంటింటి సందర్శన చేసి ఈఎఫ్ ఫారాలు పంపిణీ మరియు పూర్తి అయిన వాటి కలెక్షన్, అప్లోడ్ జరగాలని అన్నారు. రేపటికల్లా 2 లక్షల పురోగతి చేయించాలని ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పై వచ్చే ప్రతికూల వార్తలకు రీజాయిండర్ ఇవ్వాలని సూచించారు.

– అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ పురోగతిని మరింత వేగవంతం చేయాలని, శని, ఆదివారాలు, సోమవారం దినాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్రజలు ఇళ్ల వద్దే అందుబాటులో ఉండే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ శాతం పెరగాలని ఆదేశించారు. ప్రతి రోజూ సాయంత్రం బీఎల్వోలు, బీఎల్ఏలతో సమీక్షించుకుని ఏ ఏ ప్రాంతాల్లో ఎన్ని ఫారాలు అప్లోడ్ అయ్యాయి, ఏవి పెండింగ్లో ఉన్నాయనే అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి రోజు బీఎల్వో, బిఎల్ఏ సమావేశానికి సంబంధించిన ఫోటోగ్రాఫ్ ఆధారాలను ఈఆర్వోలు భద్రపరచాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, జిల్లా స్థాయి అధికారులు ఈఆర్వోలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బీఎల్వోలకు సహాయంగా ఈఎఫ్ ఫారం నింపడంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో, సహాయపడడంలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది సహకారం అందించాలని అన్నారు. సచివాలయాల్లో ఉన్న ఎడ్యుకేషన్ సెక్రటరీలు లేదా తక్కువ పనిభారం ఉన్న ఇతర సిబ్బందిని గుర్తించి ఎన్యూమరేషన్ సపోర్టింగ్ విధులకు సహకారం కొరకు నియమించాలని సంబంధిత జీఎస్డబ్ల్యూఎస్ జిల్లా అధికారిని ఆదేశించారు. డీఆర్డీఏ, మెప్మా, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామసభలు, మహిళా సంఘాల సమావేశాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్వోలు పర్యటించే సమయంలో వారికి స్థానిక సచివాలయ సిబ్బంది పూర్తి సహకారం అందేలా జిల్లా పంచాయతీ అధికారి, జెడ్పీ సీఈఓ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు సిబ్బంది అవసరమైన ప్రాంతాలను ఈఆర్వోలు ముందుగానే గుర్తించి జిల్లా అధికారులకు తెలియజేయాలని, సంబంధిత శాఖల అధికారులు వెంటనే సిబ్బందిని కేటాయించాలని కలెక్టర్ సూచించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ హెచ్చరించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి మలోల, అన్ని నియోజక వర్గాల ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తలపుల జామియా మస్జిద్ టైల్స్ పరచడానికి 44 వేల రూపాయలు నిసార్ యాసీన్ చిరు సహాయం



అంకుశం న్యూస్,కదిరి,జూన్:2:తలుపుల మండలం,తలపుల జామియా మస్జిద్ ను గత రంజాన్ నెలలో కదిరికి చెందిన సిమ్స్ హాస్పిటల్ ఎండి నిసార్ యాసీన్ సందర్శించిన సందర్భంగా నమాజు చేయడం కోసం టైల్స్ అవసరం ఉందని మసీదు పెద్దలు తన దృష్టికి తీసుకొని వచ్చారు.ఈ సందర్భంగా సాధ్యమైన తొందరగా నిర్మాణానికి అవసరమయ్యే ఖర్చును తనవంతుగా ఇస్తానని నిసార్ యాసీన్ మాట ఇవ్వడం జరిగింది.ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ 44 వేల రూపాయల చెక్కును మస్జిద్ పెద్దలకు అందివ్వడం జరిగినది.అదే విధంగా మస్జిద్ ఇమాం గారి నూతన చిరుతిండ్ల అంగడి ఉపాధి కోసం 10 వేల రూపాయల ఇవ్వడం జరిగినది.ఈ సందర్భంగా తలుపుల మాజీ సర్పంచ్ ఫయాజ్ మాట్లాడుతూ నిసార్ యాసిన్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని అభినందిస్తూ అల్లాహ్ ఆయనకు తగినంత శక్తి ఇవ్వాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులు, మస్జిద్ సెక్రటరీ ఇస్మాయిల్,మహబూబ్ బాషా,రహ్మాన్ , హిదయత్ ,రఫీ నాయక్,మౌలా అలీ, వసీం,యాసిన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పట్ల నిర్లక్ష్యం వద్దు.. అందరూ యాక్టీవ్ గా పని చేయాలి

**– పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత**

**– క్యాంప్ కార్యాలయంలో ఎస్ఐఆర్ పై సమావేశం**





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 26:** రాప్తాడు నియోజకవర్గంలో ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త నాయకులు అప్రమత్తంగా ఉండాలనిప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని.. క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని పార్టీ శ్రేణులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆమె ఎస్ఐఆర్ పై సమావేశం నిర్వహించారు. ఈనెల 15వ తేది నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఎంత వరకు పని చేస్తున్నారని ఆరా తీశారు. కొన్ని చోట్ల ఈ విషయంపై అవగాహన లేకపోవడం, బీఎల్ఏలు సరిగా పని చేయకపోవడం వంటి విషయాలను ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రతీ 20–25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణలోకి తీసుకుని చేస్తున్నట్లు చెప్పామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించామని.. ఇంకా కొందరు దీనిపై యాక్టీవ్ గా పని చేయడం లేదన్నారు. స్థానికంగా మండల, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు దీనిని బాధ్యతగా తీసుకోవాలన్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారన్నారు. జులై 15నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. బీఎల్ఏలు ప్రతి ఇంటికీ రెండు సార్లు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ఏఒ?క్క ఓటు కూడా పోకుండా చూడాలన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న పనుల మీద అప్రమత్తంగా ఉండాలన్నారు. కొందరు చదువుకోని వారిని మభ్యపెట్టే ప్రమాదం ఉంటుందని.. బీఎల్ఏలు ఈవిషయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి తమ దృష్టికి తీసుకురాలని ఎమ్మెల్యే సునీత సూచించారు...

## అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహణ



**అంకుశం న్యూస్,కదిరి ,జూన్: 26:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని, శుక్రవారం ఉదయం కదిరి పట్టణంలో లా అండ్ ఆర్డర్ పోలీసులు,ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ ఆర్ అండ్ బీ బంగ్లా నుండి ప్రారంభమై వేమారెడ్డి సర్కిల్,టవర్ క్లాక్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు కొనసాగింది.ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు,యువత మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కదిరి డీఎస్పీ శ్రీ శివ నారాయణ స్వామి, కదిరి టౌన్ ఇన్స్పెక్టర్ డి.వి. నారాయణ రెడ్డి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ వీరారెడ్డి, ఎక్సైజ్ సబ్-ఇన్స్పెక్టర్ శ్రీమతి భువనేశ్వరి,రెడ్ సృజన్ సంస్థ డైరెక్టర్ శ్రీమతి భానూజ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,యువత సమాజ నిర్మాణంలో పోషించాల్సిన బాధ్యత గురించి వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఓబులేసు డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు, వివిధ కళాశాలల విద్యార్థులు,యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ,ప్రజలు ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



**అంకుశం న్యూస్ దర్మవరం జూన్ 26:** ప్రపంచ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ధర్మవరం పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రమణి గారు మరియు వన్ టౌన్ సిఐ రెడ్డప్ప గారి ఆధ్వర్యంలో పట్టణంలోని కాలేజ్ సర్కిల్ నందు ఆటో డ్రైవర్లకు మరియు ప్రజలకు ఉద్దేశించి డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా మాదక ద్రవ్యాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ చంద్రమణి గారు మాట్లాడుతూ డ్రగ్స్ జోలికి వెళ్లకండి. మాదక ద్రవ్యాలు కలిగిన, రవాణా చేసిన, స్వీకరించిన మరియు అమ్మిన చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు వేయబడుతాయి.దానిలో భాగంగా జైలు జీవితం గడపాల్సి వస్తుంది. 1 టౌన్ ఎఐ రెడ్డప్ప గారు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడితే తమ యొక్క అపూర్వమైన జీవితాన్ని నాశనం చేసుకోవడం జరుగుతుంది. డ్రగ్స్ వద్దు బ్రో, భవిష్యత్తు ముద్దు అని తెలిపినారు.కాబట్టి దయచేసి మీరు ఈ డ్రగ్స్ వ్యవహారం జోలికి వెళ్లకుండా ఉంటారని ఆశిస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమం నందు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు మరియు సివిల్ స్టేషనల ఎస్ఐల వీరేష్ మరియు ఇషాక్ బాషా మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి సత్య కుమార్ సమక్షంలో పరిటాల శ్రీ రామ్ కు సన్మానం !



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 26:** కూటమి ప్రభుత్వం పరిపాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ధర్మవరం లో జరిగిన కూటమి విజయోత్సవ సభలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ సమక్షంలో రాష్ట్ర బీజేపీ చేనేత నాయకులు గిర్రాజు నాగేష్ తదితరులు ఘనంగా సత్కరించారు.ధర్మవరం నియోజకవర్గం ప్రగతి కోసం పరిటాల శ్రీ రామ్ చేస్తున్న కృషి మరువలేనిది అన్నారు
.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం...







- దేశ యువతను కాపాడుదాం....
- జిల్లా ఎస్. పి. జగదీష్
- మత్తు మానండి - జీవితాన్ని గెలవండి
- డిఆర్ఓ మాలోల
- ఘనంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా అవగాహన కార్యక్రమం..

**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 26:** దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని జిల్లాఎస్.పి. జగదీష్ తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్ట్స్ కాలేజి ఎగ్జిబిషన్ మైదానంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేకదినోత్సవంసందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం మరియు విభిన్న ప్రతిభా వంతుల శాఖ , ఈగల్ విభాగం సంయుక్తంగా ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్.పి. జగదీష్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ జడ్జి రాజశేఖర్, జిల్లారెవెన్యూ అధికారి మాలోల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఎస్.పి. జగదీష్ మాట్లాడుతూ ..దేశ అభివృద్ధిలో యువత శక్తి ముఖ్యమైనపాత్రపోషిస్తుందని అందువల్ల మాదక ద్రవ్య రహిత భారత దేశ ప్రచారంలో గరిష్టసంఖ్యలో యువత చేరడం చాలా ప్రధానమని పేర్కొన్నారు. ముఖ్యంగా మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా యొక్క ఈ సవాల్ ను ఎదుర్కోవడానికి ఈరోజు మనమందరంకలిసినషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజల్లో ఒక మంచి మార్పు రావాలనే సంకల్పంతో ప్రయత్నించడం జరుగు తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తూ దురలవాట్లకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న నేటి యువతను కాపాడుటకు తమ వంతుగా సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. నేటి యువత తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అలాగే తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా క్రమశిక్షణ, సత్ ప్రవర్తనతో ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టుటకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1 9 7 2 కు ఫోన్ చేసి సమాచారం తెలపాలని, సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్. పి. భరోసా కల్పించారు. అంతేగాక మాదకద్రవ్యాల నివారణ కోసం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఈగల్ ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘా చర్యలు తీసుకొని డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాలను గుర్తించి చట్టపరమైన కఠినచర్యలుతీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుఅనేకకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదని ఇందులో భాగంగానే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎస్.పి. తెలిపారు. డ్రగ్స్ వినియోగించి న వారికి ప్రత్యేకంగాప్రభుత్వం ద్వారా పునరావాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేసి వారికి తిరిగి మంచి భవిష్యత్తు కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందని ఎస్ . పి.తెలిపారు. ప్రతి సంవత్సరం జూన్ 26న మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు ఎస్.పి. తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.పిలు నాగభూషణం, ఇలియాస్, మహబూబ్ బాషా ,విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి అర్చన, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్,డి ఐ పి ఆర్ ఓ బాలకొండయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఆర్ ఐ ఓ వెంకటరమణ నాయక్, ఇన్చార్జ్ డిఇఓ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదా ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, పోలీసు , ఈగల్ విభాగం, మెడికల్ ఎక్సైజ్ శాధికారులు, పలువురు రు జిల్లా అధికారులు ఉపాధ్యాయులు ఆర్ట్స్ మరియు జూనియర్ కాలేజీ, కె ఎస్ ఆర్ స్కూల్, నలంద కాలేజీ విద్యార్థిని విద్యార్థులు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు తదితరులు స్వచ్ఛందంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అగ్నిప్రమాద బాధితులకు మంత్రి సుభాష్ ఆపన్నహస్తం-భయపడొద్దు అండగా నేనున్నానంటూ భరోసా

- సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సాయం
- మంత్రి ఒక్క పిలుపుతో రూ.60 లక్షల సహాయానికి దాతల హామీ
- మార్కెట్ ను పరిశీలించిన మంత్రి సుభాష్,జాయింట్ కలెక్టర్, ఎస్పీ




**అంకుశం న్యూస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూన్ 26:** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన ప్రజాసేవ అనే నమ్మకాన్ని మరోసారి కార్యరూపంలో చూపించారు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. ద్రాక్షారామం మార్కెట్ లో గత రాత్రి సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 48 దుకాణాలు పూర్తిగా దగ్ధమై జీవనాధారాన్ని కోల్పోయిన బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. బాధితుల ఆవేదనను ప్రత్యక్షంగా విన్న మంత్రి, "కష్టంలో ఉన్న కుటుంబాలను ఒంటరిగా వదిలిపెట్టం... బాధితుల కన్నీళ్లు తుడవడం మనందరి బాధ్యత" అని భరోసా ఇచ్చారు. మాటలతోనే కాకుండా చేతలతోనూ అండగా నిలుస్తూ, తన తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సత్యం ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. అంతటితో ఆగకుండా, ఇతర దాతలు, సేవాభావం కలిగిన ప్రముఖులతో స్వయంగా మాట్లాడి కేవలం గంట వ్యవధిలోనే మొత్తం రూ.60 లక్షల ఆర్థిక సహాయానికి హామీలు వచ్చేలా చొరవ చూపారు. బాధిత కుటుంబాలు తిరిగి తమ జీవితాలను నిలబెట్టుకునేందుకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.మంత్రి సుభాష్ మాట్లాడుతూ..ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడు వారి ఆనందంలో భాగం కావడం ఒక బాధ్యత అయితే... ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం అంతకంటే గొప్ప బాధ్యత. మనిషికి మనిషే తోడు అనే భావనతో ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం. ప్రభుత్వం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, దాతల సహకారంతో ఎవ్వరూ నిరాశలో ఉండకుండా చూస్తాం" అని అన్నారు. అగ్ని ప్రమాదంలో కాలిపోయిన షాపులను మంత్రి సుభాష్ తో పాటు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వై ఖోం నైదియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా , ఆర్డీవో సరళావతి లు పరిశీలించారు. సుమారు మూడు కోట్ల మేర ఆశ నష్టం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా బాధితులు అందరికీ ప్రభుత్వం తరఫున సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ అగ్ని ప్రమాదం చాలా దురదృష్టకరమని విచారం వ్యక్తం చేస్తూ పోలీస్ శాఖ ద్వారా 50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం జరిగిందని చెబుతున్నప్పటికీ, ఈ ప్రమాదం ఎలా జరిగింది అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బిజెపి ఇన్చార్జి దూడల శంకర్ నారాయణ, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.తమ కష్టాన్ని చూసి మానవత్వంతో చలించి ఆర్థిక సహాయానికి ముందుకు వచ్చిన మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం, దాతలు అందరికీ మార్కెట్ వర్తక సంఘం నాయకులు సుబ్బరాజు ఆధ్వర్యంలో హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో వెంటనే స్పందించి భారీ ఆర్థిక సహాయం ప్రకటించడం వల్ల బాధిత కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయని వారు పేర్కొన్నారు. సహాయాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని కన్నీటి పర్యంతమయ్యారు.

### డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ స్మారకార్థం చిగురు ఆశ్రమంలో నిత్యావసర వస్తువుల అందజేత



**అంకుశం ప్రతినిధివిజయవాడ, జూన్ 26:** దివంగత డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు చిగురు ఆశ్రమంలోని 200 మంది నిరాశ్రయులైన పిల్లలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురవుతున్న పిల్లలకు అండగా నిలవడం తమ బాధ్యతని, డాక్టర్ రాజ్ కుమార్ సేవా దృక్పథాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. స్వర్గీయ డాక్టర్ రాజకుమార్ తన జీవితకాలంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అవసరమైన దుస్తులు, కొబ్బరి నూనె, బిస్కెట్లు, వాషింగ్ సోపులు, స్నానపు సోపులు, ఆడపిల్లలకు అవసరమైన నిత్యవసర వస్తువులు మొదలగునవి పంపిణీ చేశారు. అభాగ్యులకు తమ వంతు సహాయం అందించడం పట్ల ఆశ్రమం నిర్వాహకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల కుటుంబ సభ్యులు, ఆశ్రమ ప్రతినిధులు , స్థానికులు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల్లో అనర్హులను ఏరివేస్తాం

- అర్బన్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం




**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 26:** గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కో నాయకుడు నాలుగైదు టిడ్కో ఇళ్లను తీసుకున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని ఇందులో అనర్హులను ఏరివేసి.. అర్హులకు న్యాయం చేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకు తమ సమస్యలు చెప్పుకున్నారు. వారితో ఓపికగా మాట్లాడుతూ అర్జీలు స్వీకరించారు. కొందరు టిడ్కో ఇంటికి గతంలో డబ్బు చెల్లించామని.. ఆ డబ్బు తిరిగి ఇవ్వమని కోరగా..ఎమ్మెల్యే తక్షణమే స్పందించి డబ్బు వచ్చేలా చర్యలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 48సార్లు ఈకార్యక్రమాన్ని నిర్వహించామని.. ఇందులో 1122 అర్జీలు రాగా వాటిలో 1064కి పరిష్కారం చూపించామన్నారు. మిగిలనవి కూడా వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యత వారీగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కరం చూపిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు జరగలేదన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్న ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా దర్బార్ కు రావచ్చని ఎమ్మెల్యే సూచించారు. మరోవైపు నగరంలో ప్రజా సమస్యలు పరిష్కరించడమే కాకుండా ఇప్పటి వరకు రూ.200కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్టు వివరించారు. చాలా ఏళ్లుగా పెండింగ్ లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలను పరిష్కరించామన్నారు. మరోవైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. మంత్రి నారా లోకేష్ దేశ, విదేశాలు తిరిగి సీబీఎన్ అనే బ్రాండ్ తో 25లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. ఇందులో మన ఉమ్మడి అనంతపురం జిల్లాకు 5వ జనరేషన్ కు సంబంధించిన యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. ఇది జిల్లా ప్రజలకు గర్వకారణంగా ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు..

### ముస్లిం సోదరులకు మొహరం శుభాకాంక్షలు తెలిపిన సూర్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత లక్ష్మీదేవమ్మ




అంకుశం న్యూస్, అమడాగూరు,జూన్:26: త్యాగానికి,కరుణకి ప్రతీక అయినా మొహరం పండుగను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా, ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపిన సూర్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత లక్ష్మీదేవమ్మ.ఈ సందర్భంగా లక్ష్మీ దేవమ్మ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తగారి మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ గారి త్యాగాలను స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకుంటారని తెలిపారు.ప్రజలందరూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ఈ పండుగను శాంతియుత వాతావరణంలో, సాంప్రదాయపద్ధంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### ముస్లిం సోదరులకు మొహరం శుభాకాంక్షలు తెలిపిన బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెస్ షబ్బీర్



**అంకుశం న్యూస్,ఓబుల దేవర చెరువు,జూన్:26:** త్యాగానికి,కరుణకి ప్రతీక అయినా మొహరం పండుగను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా, ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపిన బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ షబ్బీర్.ఈ సందర్భంగా ఏం.ఎస్ షబ్బీర్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త గారి మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ గారి త్యాగాలను స్మరించుకుంటూ ఈ దినాన్ని జరుపుకుంటారని తెలియజేశారు. ఎమ్మెస్ షబ్బీర్ తో పాటు రెడ్డిబాషా, హార్మోనిస్ట్ హనుమంత రెడ్డి,గణేష్,వెన్నెల హోటల్ ఆఫ్రిద్,వాటర్ మ్యాన్ వెంకటేష్ జిల్లాలోని ముస్లిం సోదరులందరికీ మొహరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్



**అంకుశం న్యూస్,కదిరి,జూన్:26:** కదిరి పట్టణం ఆర్‌డబి వసతిగృహం నందు కదిరి నియోజకవర్గం కు చెందిన 22 మందికి మంజూరు అయిన 18,55,509.00 రూ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 594 మంది లబ్ధిదారులకు గాను మొత్తం 5,08,37,998 /- రూ అందజేసిన నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కదిరివ్యవసాయ పరిశోధన కేంద్రంలో రోజువారీ కూలీలకు రూ.600 వేతనం అమలు చేయాలి ప్రజాసంఘాల డిమాండ్




**అంకుశం న్యూస్,కదిరి,జూన్:26** కదిరి ప్రాంతంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న రోజువారీ కూలీలకు వేతనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం,డీహెచ్‌పీఎస్, సీపీఐ,రైతు సంఘం, ప్రజానాట్యమండలి నాయకులు శుక్రవారం పరిశీలన నిర్వహించి కూలీలతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.కదిరప్ప తోపాటు ప్రజాసంఘాల నాయకులుమాట్లాడుతూ కదిరి పరిసర ప్రాంతాల్లో రోజువారీ కూలీలకు ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని, వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఎనిమిది గంటలు కష్టపడి పనిచేసినా కేవలం రూ.300 మాత్రమే చెల్లించడం అన్యాయమని అన్నారు.నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం,రవాణా తదితర ఖర్చులు విపరీతంగా పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో రూ.300 వేతనంతో కుటుంబాన్ని పోషించడం అసాధ్యమని పేర్కొన్నారు.వందల సంఖ్యలో పనిచేస్తున్న రోజువారీ కూలీలకు కనీసం రూ.600 రోజువారీ వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని,వ్యవసాయ పరిశోధన శాఖ అధికారులను డిమాండ్ చేశారు.కూలీలకు చట్టబద్ధమైన కార్మిక హక్కులు,సంక్షేమ సౌకర్యాలు కల్పించి, ఉపాధి భద్రతతో పాటు తగిన వేతనాలు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఇలియాకత్,సిపిఐ నాయకులు ఆదినారాయణ, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కె.అంజన బాబు,డీహెచ్‌పీఎస్ జిల్లా కోశాధికారి ఎల్.వి. రమణ,ప్రజానాట్యమండలి నాయకుడు భాస్కర్,రైతు సంఘం నాయకుడు చంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిప్పన్న,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.